క్లుప్తంగా

18న మహాపడిపూజ మహోత్సవం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల భూతనాథ అయ్యప్ప క్షేత్రం నందు 18న మహాపడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు నాగరాజు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం తెల్లవారుజామున అన్నదాన ప్రాంగణంలో మహాగణపతి హోమం, అంబ భవానీ ఆలయంలో కలశపూజ, సుబ్రమణ్య షష్టి పురస్కరించుకుని కావడి మహోత్సవం అనంతరం శోభయాత్ర, పంచలోహ త్రిమూర్తులు గణపతి, సుబ్రమణ్యస్వామి పంచగిరీషుడికి కావడి, పంచామృతాభిషేకం, 1గంటకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు నారికెళ్లపూజ, అయ్యప్ప స్వామి మహాపడిపూజ, నివేదన పడి మంగళహారతి ఉంటుందని తెలిపారు.

చదువు ద్వారానే ఉన్నత శిఖరాలు

మదనాపురం: విద్యార్థులు చదువు ద్వారానే ఉన్నత శిఖరాలు సాధించవచ్చునని చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ రవిరాజ్ వెల్లడించారు. శనివారం మండలంలోని కొన్నూరు జెడ్పీహెచ్ఎస్‌లో వివిధ అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలబాలికలు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యాపరంగా ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. అమ్మాయికి వివాహ వయస్సు 18ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు పూర్తికాకుండా ఎవరూ కూడా పెళ్లి చేయకూడదని చెప్పారు.

22న రక్తదాన శిబిరం

ఆత్మకూర్: తలసేమియా వ్యాధితో వందలాది మంది చిన్నారులు బాధపడుతున్నారని రక్తదానం చేసి వారికి పునర్జన్మ ప్రసాదించాలని వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాస్టర్ బాలు కోరారు. 22 శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే శిబిరంలో యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వివరాలకు 9848456391, 7780179152 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

గోపాల్‌పేట: రేవల్లి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం బాలిక అదృశ్యమైందని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గతేడాది పదో తరగతి పూర్తి చేసింది. ఈనెల 8న తల్లితండ్రులు ఇంటి నుంచి బయటికి వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం: కేసు నమోదు



చెలిమిల్ల రాంచంద్రమ్మ

కొత్తకోట: ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని దండుగడ్డకాలనీకి చెందిన వృద్ధురాలు చెలిమిల్ల రాంచంద్రమ్మ తన కుమారులు శివారెడ్డి, చుక్కారెడ్డిలతో కలిసి ఉంటుంది. తల్లిని ఇంటి దగ్గరే ఉంచి ఈనెల 6న ఇద్దరు కుమారులు బంధువుల పెళ్లి నిమిత్తం హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో వెళ్లారు. తిరిగి అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన కుమారులకు తల్లి కనిపించకపోయేసరికి ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల వారి ఇళ్లలోకి వెళ్లి చూసినా, బంధువులకు ఫోన్ చేసి అడిగినా ఆచూకీ లభించలేదు. చుక్కారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



పెద్దకొత్తపల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కొల్లాపూర్ కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్‌జడ్జి ఆర్‌వీఎస్ఎస్ నితీన్‌తేజ సూచించారు. మండలంలోని పెద్దకార్పాములలో గల అగ్రీ లీగల్ క్లినిక్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి సోమ, గురువారం అగ్రీ లీగల్ క్లినిక్ రైతులకు అందుబాటులో ఉంటుందని, ఏ సమస్య ఉన్నా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, న్యాయవాదులు బాలస్వామి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు, వ్యవసాయ విస్తరణాధికారి జానకీరాం, రైతు సంఘం అధ్యక్షుడు గోవిందు, అగ్రీ లీగల్ క్లినిక్ వలంటీర్ శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

గుట్టుగా మట్టి తరలింపు



భీమా కాల్వ పక్కన కొల్లగొట్టిన మొరం



మట్టిని తరలించేందుకు వచ్చిన పొక్లెయిన్, ట్రిప్పర్‌లు

అమరచింత: పాంరెడ్డిపల్లె శివారులో శనివారం నాలుగు టిప్పర్లు, పొక్లెయిన్‌తో మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో భీమా అధికారులు స్పందించి అడ్డుకున్నారు. మరోమారు ఇలాంటి ఘటనాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామి వాహనాలపై పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో అక్కడి నుంచి అక్రమార్కులు పరారయ్యారు. ఇది కేవలం ఒక్క రోజుతోనే సమస్య వెలుగులోకి రాలేదు. నిత్యం ఇలాంటి మట్టి తరలింపు ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయని చుట్టుపక్కల రైతులు తెలిపారు. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి అమరచింత, ఆత్మకూర్ మండలాల వరకు విస్తరించి ఉన్న భీమా కాల్వ మట్టి గుట్టుగా తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. అమరచింత పెద్ద చెరువు నుంచి నాగిరెడ్డిపల్లె వరకు భీమా కాల్వ లోతుగా ఉండటంతో కాల్వ తవ్వే సమయంలో మట్టిని కాల్వ వెంట కుప్పలుగా పోశారు. ప్రస్తుతం అలాంటి మొరం కుప్పలు ఎక్కడా కనిపించడం లేదు. అమరచింత మండలంలోని భీమా కాల్వ పాంరెడ్డిపల్లె సమీపంలో ఉండటంతో గ్రామ బడా నాయకులు వీటి వ్యవహారంలో కలుగజేసుకుని తమ ప్రమేయంతోనే మట్టి తరలించాలని, తమ అనుమతి తప్పనిసరి అని దబాయించడంతో మట్టిని తరలించే వ్యక్తులు అంతో ఇంతో వారికి ముట్టజెబుతూ తరలించుకుని వెళ్తున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. వీటికి తోడు కాల్వ తవ్వే సమయంలో తమ పొలాలను పోగొట్టుకుని పరిహారం పొందిన రైతులు సైతం తమ పోలంలోని మట్టి కుప్పలను తొలగిస్తే పంట చేసుకునేందుకు భూమి ఉంటుందని భావించి మట్టి మాఫియాకు అడ్డుచెప్పలేక పోతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> అక్రమంగా కాల్వ గట్టులపై ఉన్న మట్టి తరలించుకుని వెళ్లేవారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చినప్పుడల్లా మట్టి తరలింపును నిలువరించి అక్రమార్కులపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. మట్టి తరలింపునకు అనుమతి తప్పనిసరి.
>
> – మోహన్, ఏఈ, భీమా

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



విద్యార్థులకు నగదును అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ చదువులపై దృష్టి సారిస్తే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. జెడ్పీఉన్నత పాఠశాలలో శనివారం గుడిహాల్ రంగాచార్యుల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటనాథం విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించడమే కాకుండా క్రమశిక్షణ, హాజరు విధానంలో ముందున్న 9మంది విద్యార్థులను గుర్తించి వారికి రూ.1.04లక్షలు ప్రోత్సాహకంగా అందించడం సంతోషకరమన్నారు. పాఠశాలకు సీసీ కెమెరాల కోసం రూ.50వేల అందించారని తెలిపారు. ఈ మేరకు వెంకటనాథంను శాలువా, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో సౌజన్యరెడ్డి, నాగభూషణంగౌడ్, బలరాముడు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి



బోయ భీమన్న, బాలకృష్ణయ్య చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, అభ్యుదయ వాది బోయ భీమన్న, ప్రజా డాక్టర్‌గా పేరొందిన డాక్టర్ బాలకృష్ణయ్య సేవలు మరువలేనివని ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బోయ భీమన్న 18వ, డాక్టర్ బాలకృష్ణయ్య 26వ వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బాలకృష్ణయ్య విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో, స్థానిక కమాన్ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి కవులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, కవులు జనజ్వాల, రాధాకృష్ణ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో గంధం పరంజ్యోతి, తిరుమల్, రహీం, శేఖర్, గిరి యాదవ్, రమేష్, చిట్యాల రాము, కుమార్, గంధం కృష్ణయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న అధికారి మహానంది

కొత్తకోట రూరల్: తల్లిదండ్రులు ప్రతిరోజు తమ పిల్లలతో కొంత సమయం గడపాలని, స్కూల్లో ఏ ఏ అంశాలు బోధించారో వారి నుంచి అడిగి తెలుసుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది తల్లిదండ్రులకు సూచించారు. పెద్దమందడి మండలంలోని మణిగిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో అమలవుతున్న ఉన్నతి కార్యక్రమం, లక్ష్య కార్యక్రమం, పదో తరగతి ప్రత్యేక తరగతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. తెలుగు, ఆంగ్లం భాషాల్లో మంచి సామర్థ్యాలు సాధిస్తున్నారని, తల్లిదండ్రులు ప్రతి స్పందించినందుకు చాలా సంతోషంగా ఉందని, మంచి సామర్థ్యాలు సాధించేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు అధికారులు అభినందనలు తెలిపారు. పాఠశాలలో అందజేస్తున్న అన్ని రకాల టిఫిన్స్ మెనూ ప్రకారం అందజేయాలని కొందరు తల్లిదండ్రులు హెచ్ఎం శంకర్‌గౌడ్‌ను కోరారు. అనంతరం ఉపాధ్యాయులతో జిల్లా అధికారులు సమీక్ష నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బడిబయటి పిల్లల సర్వే

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ కోరారు. శనివారం మండలంలోని గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

అమరచింత: బడిఈడు పిల్లలందరూ బడిలో విద్యను అభ్యసించాలని సీఆర్‌పీ స్వామి అన్నారు. పట్టణంలో శనివారం బడి బయటి విద్యార్థుల గుర్తింపు సర్వేను నిర్వహించారు. బీసీకాలనీలో నివాసముంటున్న ఇద్దరు విద్యార్థులు బడిమాని ఇంటి పనులు చేస్తున్నారని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యతను తల్లితండ్రులకు వివరించారు. 14 ఏళ్ల లోపు వారితో పనులు చేయిస్తే పోలీసు కేసులు నమోదువతాయని తెలిపారు. బడిమానిన ఇద్దరు విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించామని సీఆర్‌పీ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగేంద్రమ్మ, భవిత కేంద్రం టీచర్ స్వప్న పలువురు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలో బడిబయటి పిల్లల ఇంటింటి సర్వే కొనసాగుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఆర్పీలు ఇంటింటి సర్వే నిర్వహించారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడు, బుద్దారం గ్రామాలకు ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3:30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. వనపర్తి ప్రధాన సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

యువకుడికి గాయాలు

అడ్డాకుల: కొమిరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. శాఖాపూర్‌కి చెందిన నరేష్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై భూత్పూర్ వైపు వెళ్తున్న క్రమంలో కొమిరెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో నరేష్‌రెడ్డి రోడ్డుపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది వచ్చి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నిర్వహించారు. శాఖాపూర్ తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా కొత్తగా వేసిన రోడ్డుపై వరుసలను సూచించే మార్జిన్ వైట్ లైన్ లేకపోవడమే ఘటనకు కారణమని తెలుస్తోంది.

బీజేపీ పాలనలో భద్రతా వైఫల్యం: సీపీఐ



మాట్లాడుతున్న బాలనర్సింహ

పెబ్బేరు రూరల్: బీజేపీ పాలనలోనే రెండుసార్లు పార్లమెంట్‌పై దాడులు చేశారని, వారి పాలనా వైఫల్యానికి ఇవి నిదర్శనాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలనరసింహ విమర్శించారు. శనివారం వనపర్తి జిల్లా సీపీఐ కార్యాలయంలో కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశభక్తి పేరుతో మతాల మధ్య విద్వేషం రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందడమే బీజేపీ నైజమని ఆరోపించారు. దాడి ఘటనకు నైతిక బాధ్యత వహించి హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రధానమంత్రి, హోంమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు మద్దతు వల్ల ప్రజలకు మేలు కలుగుతుందనే మద్దతు ఇచ్చామన్నారు. సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందన్నారు. ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు వల్ల గ్రామాల్లో సీపీఐ విస్తరణకు సానుకూలత ఏర్పడిందని పార్టీ శ్రేణులు ఉపయోగించుకోవాలన్నారు. డిసెంబరు 26న పార్టీ 98వ వార్షికోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఎర్ర జెండా ఎగరవేసి ఘనంగా నిర్వహించాలన్నారు. 2024 పార్టీ సభ్యత్వం చేపట్టాలని, గతం కంటే పెంచాలన్నారు. చంద్రయ్య వర్ధంతిని జనవరి 2వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో విజయరాములు, కళావతమ్మ, శ్రీరాం, మోష, ఎర్ర కుర్మయ్య, రాబర్ట్, పర్వతాలు, కుతుబ్, యూసుఫ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ

ఖిల్లాఘనపురం: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్ఎం జయశంకర్, పీఈటీ మన్యం శనివారం తెలిపారు. 11వ తేదీన జిల్లా కేంద్రంలోని బాలకృష్ణయ్య క్రీడాప్రాంగణంలో నిర్వహించిన ఎంపికల్లో ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థులు అనూష, శిరీష, నాగేశ్వరి, 9వ తరగతి చదువుతున్న రాకేష్, అండర్–17లో పదో తరగతి విద్యార్థులు అరుణ్, శివకుమార్ పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్–14 విభాగం వారు కామారెడ్డిలో, అండర్–17 విభాగం వారు వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, పీఈటీలు తోటి విద్యార్థులు అభినందించారు.

ఆధార్ కేంద్రం వద్ద గుమికూడిన జనం



పాన్‌గల్ ఆధార్‌కేంద్రం వద్ద గుమిగూడిన జనం

పాన్‌గల్: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డులు పొందడం, ఫోన్ నంబర్లు లింకు చేసుకునేందుకు శనివారం మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ప్రతి అంశానికి ఆధార్‌కార్డు ప్రమాణికం కావడంతో కార్డులో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు జనం పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. సర్వర్ పనిచేయకపోవడం వంటి సమస్యలతో కేంద్రాల వద్ద గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన



పాలెంలో అవగాహన విద్యార్థులు

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెంలో శనివారం మల్లారెడ్డి విశ్వవిద్యాలయం విద్యార్థులు రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, ఉపయోగాలపై వివరించడంతో పాటు లీటరు పంచగవ్యను ఉత్పత్తి చేయడానికి దాదాపు రూ.18 నుంచి రూ.20వరకు ఖర్చవుతుందన్నారు. వ్యవసాయంలో పశుగ్రాసం పంటలలో పంచగవ్యను వాడితే తెగుళ్లను నియంత్రించడానికి, పంట పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. పంటలకే కాకుండా కోళ్లలో రోగ నిరోధక శక్తిగా దీనిని వాడటం వలన ఇతర కోళ్ల కంటే పంచగవ్య వాడిన కోళ్ల శరీర బరువు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భవాని, శాస్త్రవేత్త భోగరేదాదాసాహేద్, సీనియర్ శాస్త్రవేత్త అధిపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బంగారు శృతి
- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న బంగారు శృతి, ఎల్‌డీఎం కౌశల్ కిశోర్ పాండే

నాగర్‌కర్నూల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించనున్నట్లు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బంగారు శృతి అన్నారు. జిల్లాలో జనవరి 26 వరకు నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిశోర్ పాండేతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేందుకు గాను ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాకు 6 ఐఈసీ (ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) వాహనాలు ఏర్పాటు చేశారని, ఒక్కో వాహనం రోజు రెండు నుంచి మూడు గ్రామాలు లేదా మున్సిపాలిటీ వార్డుల వారీగా పర్యటించి 17 రకాల పథకాలను ప్రచారం చేస్తాయన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి లబ్ధి పొందని వారిని గుర్తించి పథకాలను అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కలెక్టర్ అధ్యక్షతన ఒక నోడల్ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించడం, రైతుల పొలాల్లో సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన, పారిశుద్ధ్యం, వైద్య సలహాలు, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అధికారులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని కోరారు. అంతకుముందు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేయించి, ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తిటౌన్/కొత్తకోటరూరల్/పెబ్బేరురూరల్: జిల్లా కేంద్రంలోని 9వ వార్డు బీకేతండాకు చెందిన ననావత్ మీరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అదేవిధంగా పెద్దమందడికి చెందిన గొంది చిన్నమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. పెబ్బేరు మండలంలోని తోమాలపల్లికి చెందిన బోడస్ ఎల్లస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధితులకు ఆర్థికసాయం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులకు ఆదేశించారు. ఈ మేరకు రూ.5వేల చొప్పున ఒక్కో కుటుంబానికి అందించారు.

పాఠశాలలో తాగునీటి ఇబ్బందులు



పాఠశాలలో మరుగున పడిన కుళాయిలు



పాఠశాల ఆవరణలో ఉన్న మిషన్ భగీరథ కుళాయి

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పాఠశాల ఆవరణలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నా విద్యార్థులకు తాగేందుకు నీటిని అందించలేని దుస్థితి నెలకొంది. గతేడాది పాఠశాలలోని విద్యార్థులకు భోజన సమయంలో తాగునీటి ఇబ్బంది కలగకుండా జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.లక్ష వెచ్చించి నిర్మించిన కుళాయిలు సైతం పనిచేయడం లేదు. దీంతో నిత్యం విద్యార్థులు భోజన సమయంలో తాగేందుకు నీరులేక ఉన్న ఒక్క కుళాయి నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ఉన్న కుళాయి సైతం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజన తయారీతో పాటు విద్యార్థులకు నీటిని అందించేందుకు మున్సిపాలిటీ నుంచి వాటర్ ట్యాంకర్‌ను పాఠశాలకు తెప్పించుకున్నట్లు హెచ్ఎం బలరాముడు తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులను దూరం చేయాలని కోరుతున్నారు.

మెరుగైన విద్య అందించాలి



విద్యార్థులతో కలెక్టర్ రవినాయక్

చిన్నచింతకుంట: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ రవినాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం లాల్‌కోటలో పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన విద్యాసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. చదువుకు పేదరికం అడ్డం కాదన్నారు. తాను కూడా మారుమూల ప్రాంత గిరిజన తండాలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదివినట్లు వివరించారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు తన స్వంత నిధులతో పాటు దాతల సహకారంతో అల్పాహారం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్ సింగ్, ఆర్ఐ తిరుపతయ్య, ఎంపీటీసీ శివరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com